# లవ్ మ్యారేజ్

రోజాకి అసహనాన్ని కలిగిస్తోంది ఈ పెళ్ళి ప్రయాణం.

అమ్మా వాళ్ళమీద చాలా కోపంగా కూడా వుంది. "అన్నయ్య పెళ్ళి. వెళ్ళక పోతే బాగుండదు." అంటూ ఒకటే గొడవ చేశారు.

"ఎన్ని ప్లాన్స్ వేసుకుంది తను ఫ్రెండ్స్‌తో కలిసి పిక్నిక్‌కి వెళ్ళాలని! ఈ పెళ్ళి ధర్మమా అని అన్నీ కాన్సిల్ అయ్యాయి. వాళ్ళందరూ చక్కగా పిక్నిక్‌కి వెళ్తే తనేమో యిక్కడిలా..."

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ఎర్రబడిన మొహంలో.. అసలే చిన్నదయిన నోరు మరింత అందంగా ముడుచుకుపోయింది.

"ఏవిటా ఏడుపు మొహం! వెళ్తోంది పెళ్ళి యింటికి." అమ్మ అరుపులు ఉక్రోషాన్ని మరికాస్త పెంచాయి.

మొహం తిప్పేసుకుని రిక్షాలో ఒకప్రక్కకి ఒదిగి కూర్చుంది.

ఇంకా పూర్తిగా తెల్లవారలేదు. ఊరు అప్పుడే నిద్ర లేస్తోంది. ముందు రిక్షాలో తామిద్దరూ.. వెనక రిక్షాలో నాన్నా, తమ్ముడూ.

రెండు రిక్షాలూ పోటీపడి చేస్తూన్న మువ్వల శబ్దం వినసొంపుగా వుంది.

చల్లటిగాలి వీస్తోంది. తెల్లవార్లూ చేసిన బస్ ప్రయాణంతో చిరాకుగా వున్న వంటికి ఆ గాలి చాలా హాయిగా వుంది. దూరంగా గుడి.. మైకులోనుంచి ఏసుదాస్ గొంతు మనోహరంగా వినిపిస్తోంది.

ఆ వాతావరణం పరవశాన్ని కలిగించింది రోజాకి. కోపం కరిగి పోతూంటే.. మనసులోకి మెలమెల్లగా ఆనందం వచ్చి చేరుతోంది. అది చిరునవ్వుగా మారి పెదవులపై నర్తిస్తోంది.

రిక్షా ఆగేసరికి రోజా కోపం పూర్తిగా ఎగిరిపోయింది. చెంగున క్రిందికి దూకి హుషారుగా లోపలికి నడిచింది.

చుట్టాలు అందరూ ముందురోజు రాత్రే వచ్చేసినట్లున్నారు. మగపిల్లలు వరండా నిండా అడ్డదిడ్డంగా పడుకుని వున్నారు. గడప దగ్గర కూడా ఖాళీ లేదు.

పరికిణీ ఎత్తి పట్టుకుని జాగ్రత్తగా వాళ్ళమధ్యనుంచి దారి చేసుకుంటూ లోపలికి వెళ్ళబోయింది రోజా.

ఆమె కాలి మువ్వల శబ్దానికేమో! గడప ప్రక్కనే ముసుగుపెట్టి పడుకున్న వ్యక్తి ఒక్కసారిగా కదిలాడు. అలా కదలడంతో అతని ఎడమచేయి రోజా పాదం క్రింద పడి నలిగిపోయింది. అతను చిన్నగా మూలుగుతూ మొహం పైనుండి దుప్పటి తొలగించాడు.

నిద్రమత్తుతో నిండిన అతని కళ్ళు రోజాని ఒక్క క్షణం ఆశ్చర్యంగా చూశాయి. ఆ మరుక్షణం అతని కళ్ళల్లోకి మెరుపూ, పెదవులపైకి చిరునవ్వూ దూసుకొచ్చాయి.

"హలో" అన్నాడు లేచి కూర్చుంటూ.

రోజా మాత్రం నివ్వెరపోయి చూస్తూండిపోయింది.

" ఎవరితను! .. కిరీటం లేని రాకుమారుడిలా. . . కోదండం లేని శ్రీరామచంద్రుడిలా. . ఎంత బాగున్నాడు!"

ఆమె ఆలోచలలోనుంచి తేరుకోక ముందే అమ్మా, నాన్నా, తమ్ముడూ లోపలికి వచ్చారు.

వెనుకనుంచి అమ్మ అడుగుతోంది "ఏమిటి! బావని గుర్తు పట్టలేదా!" అని. చెప్పలేనంత ఆశ్చర్యంతో గిర్రున వెనక్కి తిరిగింది రోజా.

"ప్రశాంత్ బావ" నవ్వుతూ చెప్పి అమ్మ లోపలికి వెళ్లింది.

"ప్రశాంత్ బావ" .. "ప్రశాంత్ బావ" రోజా చెవుల్లో మారుమ్రోగింది ఆ మాట. లోపలికి ఎలా వెళ్ళిందో, అందర్నీ ఎలా పలకరించిందో ఆమెకే తెలీదు.

ప్రశాంత్ బావ అంటే రోజా మనసులో వున్న రూపం వేరు. పన్నెండేళ్ళ వయసులో ఆమె చూసిన ప్రశాంత్ బావ అనుక్షణం ఆమెని ఏడిపించేవాడు.

ఏ మాట మాట్లాడినా వెక్కిరించేవాడు.

బలవంతంగా ఉయ్యాల ఎక్కించి భయంతో ఆమె గుండె ఆగిపోయేంత వేగంగా వూపేవాడు.

పరుగు పందేలు పెట్టి మైళ్ళకు మైళ్ళు పరుగెత్తించేవాడు. అలుపొచ్చి, కళ్ళల్లో నీళ్ళొచ్చి తను కూర్చుండి పోతే. . . "అంతా ఏక్షన్" అంటూ వెక్కిరించేవాడు.

"అలాంటి రాక్షసుడు రాజకుమారుడు ఎప్పుడయ్యాడు! ఎలా అయ్యాడు!"

పెళ్లి హడావిడిలో మునిగిపోయినా, మామయ్య కూతుర్లతో కబుర్లాడుతున్నా..
ప్రశాంత్‌ని చూసినప్పుడల్లా ఆమె పులిక్కిపడుతోంది.

ఆమె పులికిపాటు చూసి అతని పెదవులు అల్లరిగా నవ్వుతున్నాయి. కాసేపు యిదంతా గమనించాక పిల్లలు ఆటపట్టించడం మొదలు పెట్టారు.

ముహూర్తం రాత్రి పదకొండు గంటలకి.

మధ్యాహ్నం అందరూ చిన్న వాన్‌లో పెళ్ళికూతురి వూరికి బయల్దేరారు. రోజా వయసు పిల్లలందరూ ఒక ట్రిప్‌లో వెళ్ళారు.

వాన్ ఎక్కేముందు ప్రశాంత్ కోసం ఆమె కళ్ళు వెతికాయి. అతను కనబడలేదు.

"ఏం పనుల మీద తిరుగుతున్నాడో!" ఉక్రోషంగా అనుకుంది.

చాలా దూరమే వుంది ఆ వూరు. వాన్ బయలుదేరగానే అందరూ అల్లరి మొదలు పెట్టారు. అంత్యాక్షరి ఆడదామన్నారు. ఆడపిల్లలంతా ఒక గ్రూప్.

మగ పిల్లలంతా మరో గ్రూప్.

మొదట్లో మగపిల్లలు కాస్త కామ్‌గానే వున్నారు. కాని అమ్మాయిలు వాళ్ళని అలా వుండనివ్వదల్చుకోలేదు.

"ద" తో పాట పాడమనగానే దిక్కులు చూస్తున్న అబ్బాయిల్ని చూసి అమ్మాయిలు వెక్కిరించారు. అజయ్ గొంతు సవరించుకున్నాడు. అతను రోజాకి పిన్ని కొడుకు.

"దేవ దేవ ధవళాచలమందిర.." అంటూ అతను పాట మొదలు పెట్టగానే...

అమ్మాయిలందరూ "ఓ" అంటూ అరుపులు మొదలు పెట్టారు.

మామయ్య కూతురు జ్యోత్స్న అందరికంటే అల్లరి పిల్ల. అందరూ ఆపేసినా అది మాత్రం "ఓ" అని అరుస్తూనే వుంది, అతని పాట వినబడనీయకుండా.

అజయ్ పాట ఆపేశాడు. ఒక్కక్షణం జ్యోత్స్నని తేరిపార చూశాడు. అంతే. అతని గొంతులో అల్లరి కదం తొక్కింది. "దంచవే మేనత్త కూతురా!" అంటూ అందుకున్నాడు.

ఒక్కసారిగా మారిన ట్యూన్‌కి అబ్బాయిలు ఈలలు వేశారు. జ్యోత్స్న బుగ్గలు సిగ్గుతో కందిపోయాయి. ఇక అక్కడినుంచీ అబ్బాయిల అల్లరికి అంతు లేదు.

పెద్ద పందిరి వేసివున్న ఇంటి ముందు ఆగింది వాన్. అక్కడ అంతా పల్లె వాతావరణం. దూరంగా పొలాలు కనిపిస్తున్నాయి.

పచ్చటి పొలాలపై కొంగలు వాలితే అంత అందంగా వుంటుందని. . సూర్యాస్తమయం అంత అద్భుతంగా వుంటుందని . . . అప్పటివరకూ రోజాకి తెలీదు.

చీకటిపడుతూ వుంటే అందరూ పెళ్ళికి రెడీ అవసాగారు. రోజా కూడా పట్టుచీర కట్టుకుంది.

ఆ పల్లె వాతావరణం. . పెళ్ళి వేడుకలు, తోటి పిల్లల అల్లరి. . అన్నీ రోజాకి చాలా నచ్చాయి. "అమ్మో! ఈ పెళ్లికి రాకపోతే ఎంత ఆనందాన్ని మిస్ అయ్యేదాన్ని!" అనుకుంది.

ఆమె కళ్లు మాత్రం ప్రశాంత్ కోసం వెతికి వెతికి అలసిపోయాయి. భోజనాల దగ్గర ఒక్కసారి కనబడి మాయమయ్యాడు. తనని చూశాడో లేదో కూడా అర్థం కాలేదు.

ముహూర్తానికి యింకా కొంచెం టైమ్ వుంది. అందరూ గుంపులు గుంపులుగా కూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఎవరో అడుగుతున్నారు అత్తయ్యని. . "ప్రశాంత్‌కి సంబంధం కుదుర్చుకోవడం అయిందిగా! మరిక పెళ్ళెప్పుడు చేస్తున్నారు! " అని.

రోజా వులిక్కిపడింది.

"ఎక్కడా! ఈ రోజేగా సంబంధం కుదిరింది!" అత్తయ్య నవ్వుతూ అంటోంది. "వాళ్ళు ఇప్పుడడిగారు గానీ . . . మేమయితే ఎప్పటినుంచో అనుకుంటూనే వున్నాం ఈ సంబధం చేసుకోవాలని."

వింటూన్న రోజాకి స్పృహ తప్పినట్లయింది. పెళ్ళి కుదిరిందా! బావకి పెళ్ళి కుదిరిందా! . . ఎప్పుడు! ఎవరితో!

"పిల్ల నచ్చిందా వాడికి!" ఇంకెవరో అడుగుతున్నారు.

రోజా ఊపిరి బిగపట్టింది ఉత్కంఠతో.

"ఆ. వాడికి యిష్టమే. అయినా అసలు వాడిని అడగనక్కరలేదు. మేమెలా చెప్తే అలా వింటాడు." అత్తయ్య గొప్పగా చెప్పింది.

అమ్మకి రోషం వచ్చినట్లుంది. "మన పిల్లలందరూ అంతేలే వదినా! మా రోజా కూడా పెళ్ళి విషయంలో మేమెలా చెప్తే అలా వింటుంది. ప్రేమ పెళ్ళిళ్ళూ అవీ దానికి అసలు నచ్చవు." అంది.

వింటూన్న రోజాకి తలబాదుకోవాలనిపించింది. "అయ్యో! అదంతా నిన్నటి మాటమ్మా!" అనుకుంది.

అమ్మ మాటల్లో అసత్యం ఏమీ లేదు. తనకి లవ్‌మారేజెస్ అంటే పడేది కాదు యిప్పటివరకూ.
వారం రోజుల క్రితం ఫ్రెండ్స్‌తో జరిగిన చర్చ గుర్తొచ్చింది రోజాకి. వాళ్ల క్లాస్‌మేట్ ఒక అమ్మాయి లవ్‌మారేజ్ చేసుకుంది. పెద్దవాళ్ళకి తెలీదు. ఆ విషయం తెలియగానే రోజా నిరసనగా అంది.. "ఇలాంటి పెళ్ళిళ్ళు నాకు యిష్టం వుండవు." అని.
ఫ్రెండ్స్ అందరూ ఆశ్చర్యంగా చూశారు.
కళ్యాణి అయితే గట్టిగానే అడిగింది.. "ఏం! ఎందుకని!" అని.
"ఏమో! పెద్దవాళ్ళకి తెలీకుండా ఏదో ఆకర్షణలో చేసుకునే ఆ పెళ్ళిళ్ళు ఎంతకాలం నిలబడతాయి!" అంది రోజా.
"ఛ. ఎందుకే అలా అంటావు! అన్ని పెళ్ళిళ్ళూ అలాగే వుంటాయా! నిజంగా అవగాహనతో చేసుకునే పెళ్ళిళ్ళు వుండవా ఏమిటి? అయినా లవ్ మారేజ్‌లో వుండే థ్రిల్లే వేరు." కళ్యాణి మాటలకి అందరూ నవ్వారు.
అలాంటి చర్చలు అంతకు ముందు కూడా చాలాసార్లు జరిగాయి. వాళ్లు ఎప్పుడూ లవ్‌మారేజ్‌ని సమర్థించేవారు. తను వ్యతిరేకించేది. కానీ యిపుడు.. యిపుడు తెలుస్తోంది, ప్రేమంటే ఏమిటో! ప్రేమించేటపుడు కనీసం తనని అడగనైనా లేదు తన మనసు. తన అభిప్రాయాలేమిటో, ఆలోచనలేమిటో తెలుసుకోలేదు.
అతన్ని చూడటం ఆలస్యం. తపిమని ప్రేమించేసింది.
అతన్ని తప్ప ఎవర్నీ పెళ్ళి చేసుకోవడానికి వీల్లేదంటోంది.
"ఇపుడెలా! ఎవరికి చెప్పుకోవాలి తను తన ప్రేమ గురించి!" దిగులుగా బయటకి వచ్చిన రోజాకి గడప దగ్గర నిల్చున్న ప్రశాంత్ కనిపించాడు. అతను కూడా అత్తయ్య వాళ్ళ మాటలు విన్నాడు కాబోలు .. రోజా వైపు నివ్వెరపోయి చూశాడు.
తర్వాత మెల్లగా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు.. ఇంటికి వెనకవైపున్న తోటలోకి.
రెండు నిమిషాలు అస్థిమితంగా గడిపి రోజా కూడా అటు నడిచింది.
దూరంగా మామిడిచెట్టు క్రింద నిలబడి వున్నాడు ప్రశాంత్.
అలికిడి విని వెనక్కి తిరిగాడు. పిండారబోసినట్లున్న వెన్నెల్లో, అతని కళ్లల్లోని వేదన స్పష్టంగా కనపించింది రోజాకి.
గుండె పిండేసినట్లయింది. అతను చేతులు సాచగానే ఒక్క పరుగున వెళ్ళి ఆ కౌగిలిలో వాలిపోయింది.

అతను వణికే కంఠంతో చెప్పాడు.. "నేను నిన్ను తప్ప ఎవర్నీ పెళ్ళి చేసుకోలేను."
"నేనూ అంతే." అన్నట్లుగా అతన్ని హత్తుకు పోయింది రోజా.
అతను ఆమె తలని పైకి ఎత్తి పట్టుకుని చెప్పాడు ఆవేశంగా... "ఎల్లుండి నేను ఒక టాక్సీ తీసుకుని మీవూరు వస్తాను. సెంట్రల్ లైబ్రరీ దగ్గరికి వచ్చేసెయ్యి నువ్వు. ఇద్దరం కల్సి వేరే వూరు వెళ్ళిపోదాం... మీఫ్రెండ్ కళ్యాణి వాళ్ళ వూరు.."
రోజా కళ్ళు ఆశ్చర్యంతో పెద్దవయ్యాయి. "కళ్యాణా! కళ్యాణెలా తెలుసు నీకు!"
ప్రశాంత్ నవ్వాడు. ఆమె ముక్కు పట్టి వూపుతూ చెప్పాడు. "వాళ్ల అన్నయ్య నాకు చిన్నప్పటినుండీ క్లాస్‌మేట్. ఇంజనీరింగ్‌లో కూడా. నా బెస్ట్ ఫ్రెండ్ వాడు. వాళ్ళ వూరు వెళ్తే వాళ్ళు మనకి హెల్ప్ చేస్తారు. కళ్యాణి కూడా నీకు మంచి ఫ్రెండేగా! ఎప్పుడూ చెప్తూ వుంటుంది.. నీగురించి.. నీ మాటల గురించీ."
రోజా జవాబు చెప్పలేదు.
"మనిద్దరికీ యిష్టమయినపుడు ఆలోచన ఎందుకు చెప్పు!" ఆమె ముంగురులు సవరిస్తూ అన్నాడు ప్రశాంత్.
"ఇటు చూడు..." ఆమెకి అర్థమయ్యేలోపూ అతని పెదవులు ఆమె పెదవులని స్పృశించాయి. రోజా పులికిపడింది. పెళ్ళి పందిట్లోనుంచి ఒక్కసారిగా మంగళవాద్యాలు వినపడ్డాయి.
ఆమెని మెల్లగా వదిలేస్తూ అన్నాడు ప్రశాంత్ "నేను లోపలికి వెళ్తాను. నన్ను నిరాశపర్చకు."
రోజా నిశ్చేష్టురాలిలా నిలబడిపోయింది. హేమంతపు చలి వణికిస్తోంది. పెదవులపై అతని స్పర్శ కలిగించిన ఉద్వేగంతో గుండె కంపిస్తోంది. ఆనందంతో, తెలీని దుఃఖంతో వూగిపోతోంది.
"ఎంత చిత్రం! నిన్నటివరకూ ప్రేమని నమ్మని తను ఈరోజు ప్రేమికురాలు. చిక్కుల్లోపడ్డ ప్రేమికురాలు!
తన జీవితం మొత్తంలో అనుభవించని సంతోషం, భయం, దుఃఖం, దిగులు, వుద్వేగం.. అన్నీ ఈ ఒక్క రోజులో అనుభవించిందేమో!
ప్రేమ యింత అద్భుతంగా వుంటుందా! వేరే వూరు పారిపోవడం.. పెళ్ళి చేసుకోవడం.. బావ చెప్తుంటే థ్రిల్లింగ్‌గానే వుంది.

కానీ ఎందుకలా! బావకి యిష్టం. తనకి యిష్టం. అమ్మావాళ్ళు మాత్రం ఎందుకు ఒప్పుకోరు! ఇప్పటివరకూ ఎప్పుడూ వాళ్ళమాట కాదనలేదు తను. ఈ ఒక్కసారి తనమాట వినరా వాళ్ళు! అత్తయ్యకి మాత్రం తనంటే ఎంత యిష్టం! తనని కాదంటుందా!"

ఏదో తెగింపు వచ్చినట్లూ పెళ్ళిపందిట్లోకి నడిచింది. "ముందు అమ్మావాళ్ళకి చెప్పాలి. వాళ్ళు కాదంటే అపుడు ఎలాగూ బావతో వెళ్ళిపోవడమే."

వడివడిగా వస్తున్న రోజాని తల్లీ, అత్తయ్యా.. అందరూ ఆశ్చర్యంగా చూశారు. ప్రశాంత్ చేయి పట్టుకుని వాళ్ళ దగ్గరికి నడిచింది రోజా. "అమ్మా! నేను ప్రశాంత్ బావని పెళ్ళి చేసుకుంటాను. మీరు ఒప్పుకున్నా సరే. ఒప్పుకోక పోయినా ...సరే." రొప్పుతూ చెప్పింది.

అమ్మ నవ్వింది. "చేసుకోవే! ఎవరొద్దన్నారు!" అంది.

అత్తయ్య మాత్రం సీరియస్‌గా "అయితే మేం ముహూర్తాలు పెట్టించేదాకా ఆగరా!" అంది.

రోజా బిత్తరపోయింది. "అదికాదు.. మరి.. మరి..." మాటలకోసం వెతుక్కుంటుంటే .. ఆమెని చూసి ప్రశాంత్‌తో సహా అందరూ నవ్వేశారు.

"మీ అమ్మా, నాన్నా ప్రొద్దునే అడిగారు మామయ్యని. మామయ్య కూడా సరేనన్నారు. సంబంధం ఖాయం అనుకున్నాం." అత్తయ్య చెప్తూ వుండగానే సిగ్గుతో బయటికి పరుగెత్తింది రోజా.

ఆమె వెనకే తోటలోకి వచ్చిన ప్రశాంత్‌ని చూసి ఉక్రోషంగా అరిచింది. "ఇంత మోసం చేస్తావా! ఎందుకలా అబద్ధాలు చెప్పావు!"

తోసేస్తూన్న రోజాని బలవంతంగా దగ్గరికి తీసుకున్నాడు ప్రశాంత్. "పెళ్ళికి ముందు ప్రేమ ఎలా వుంటుందో.. లవ్‌మారేజ్‌లో థ్రిల్లేమిటో నీకు తెలియచేద్దామని.." గుసగుసగా చెప్పాడు.

"థ్యాంక్యూ" అంటూ అతని గుండెల్లో తలదాచుకుంటున్న రోజాని చూసి జాబిల్లి ఫక్కున నవ్వాడు.

*****